# తగిన శాస్తి

కృత్తిక



**ఆ రోజు** విశాఖ హార్బరులో మొదటి షిఫ్టు పని ఇంకా మొదలు కాలేదు. వర్కర్లందరూ మస్టరు వేయించుకుని టీ త్రాగేవాళ్ళు టీ త్రాగడం, కబుర్లు చెప్పే వాళ్ళు కబుర్లు చెప్పడం చేస్తున్నారు. ఇంతలో కీ ఫోర్మన్ వెంకటగిరి తన డొక్కు సైకిలు మీద చెమటలు కక్కుకుంటూ వచ్చాడు. వర్కర్లందరూ ఆయనకు పాదాభివందనం చేసినంత హంగామాగా "నమస్కారం సార్, నమస్తే సార్" అంటూ అక్కడున్న వారిలో ఏ ఒక్కడూ తప్పిపోకుండా విష్ చేశారు. ఫోర్మన్ వెంకటగిరి చిన్నగా నవ్వుకుంటూ అందరూ తనకు నమస్కారం పెడుతున్నారా లేదా అన్నట్టు చెక్ చేసుకుంటూ కంట్రోలు రూము మెట్లు ఎక్కసాగాడు. ఆయన వెంట కొందరు భజంత్రీలు వాయిస్తూ అనుసరించారు. కొందరు ముభావంగా, మరి కొందరు లోలోన తిట్టుకుంటూ నిల్చున్నారు.

విశాఖపట్నం పోర్టు ట్రస్టులో ట్రాఫిక్ మనేజరు విభాగానికి చెందిన షిప్పింగ్ కంట్రోలు కీ ఫోర్మన్ గా వెంకటగిరికి ఆఫీసర్ల దృష్టిలో మంచి గురి ఉంది. వర్కర్ల చేత చక్కగా పని చేయించే నైపుణ్యం వెంకటగిరిలో ఉందని ఆఫీసర్ల నమ్మకం. వెంకటగిరి లాంటి కీ ఫోర్మన్‌లు మరో నలుగురు ఉన్నారు. కానీ కంట్రోలు రూమ్ కేవలం వెంకటగిరి చాకచక్యం వల్లే ఏ ప్రాబ్లెమ్సూ లేకుండా నడుస్తోందని అందరికీ మా చెడ్డ నమ్మకం.

నిజానికి మిగతా కీ ఫోర్మన్లందరిలోకీ వెంకటగిరి అంటేనే వర్కర్లందరికీ కాస్త గౌరవం ఎక్కువ. ఎందుకంటే వెంకటగిరి వర్కర్లకు వ్యక్తిగత సమస్యలు వచ్చినా, డ్యూటీలకు సంబంధించిన సమస్యలు వచ్చినా ఆదుకుంటాడు. వాళ్ళకు చక్కటి సలహాలు ఇచ్చి వాళ్ళ సమస్యలు తీరే మార్గాలు చూపిస్తాడు. అలాగే సెలవులు రికమెండు చెయ్యడంలో కూడా ఎవరికీ బాధ లేకుండా చేస్తాడు.

అప్పుడప్పుడు వర్కర్లకు కాఫీ, టీలకు డబ్బు లేకపోతే రెండు మూడు రూపాయలు అప్పుగా ఇస్తాడు. శాలరీ డే నాడు దగ్గరుండి అందరికీ విట్నెస్ సంతకాలు చేస్తూ సరిగ్గా జీతాలు అందేటట్లు చూస్తాడు. ఇలా చాలా విషయాల్లో వెంకటగిరి ఇటు వర్కర్లలోనూ, అటు ఆఫీసర్లలోనూ మంచి పలుకుబడి సంపాదించాడు. కాకపోతే అతనికి ఉన్న దుర్గుణం ఒక్కటే. వర్కర్లందరూ తనని చూడగానే "నమస్కారం సార్" అన్నారా లేదా అన్నది మాత్రం "కీన్" గా అబ్జర్వ్ చేస్తాడు. ఎవరైనా పొరపాటున అలా నమస్కారం పెట్టకపోతే వాడ్ని తరువాత ముక్కు మీద గుద్దినట్లు అడుగుతాడు. "ఏవోయ్, అప్పుడే పెద్దాడివైపోయావ్" అంటూ దెప్పిపొడుస్తాడు. లేదా తోటి వర్కరుతో "ఫలానా వాడు నన్ను చూసి కూడా ఏం పట్టనట్టు ప్రవర్తిస్తున్నాడోయ్" అంటూ ఇన్‌డైరెక్టుగా వార్నింగ్ పంపిస్తాడు. ఖర్మం చాలక ఆ వారంలో అలా నమస్కారం పెట్టని వాడు సెలవుకు గాని అప్లయ్ చేస్తే వాణ్ణి మున్నై చెరువుల నీరు తాగిస్తాడు. ఇదే అతనిలోని లోపం!

వెంకట గిరి కంట్రోలు రూమ్ మెట్లన్నీ ఎక్కాక వరండాలో నిల్చుని అందరినీ కలయజూస్తూ

"ఏవోయ్ ! అందరికీ డ్యూటీలు పోస్టింగ్ అయి నట్లే కదా?" అన్నాడు. అందరూ ముక్త కంఠంతో "యస్సార్" అన్నారు.


"సో ఎవరి పనుల్లోకి వాళ్ళు వెళ్ళండి మరి ! చాలా టైము గడిచిపోయింది" అంటూ కంట్రోలు రూమ్‌లోకి వెళ్ళిపోయాడు. వర్కర్లంతా వర్క్ స్పాట్‌లలోనికి వెళ్ళడానికి బయలుదేరారు. ఇది రోజూ జరిగేదే!

*** *** ***

అది ఈస్ట్ క్వే కి త్రీ బెర్త్. ఆ బెర్త్ మీద పంచదార బస్తాలు ఓడలోంచి దిగుతున్నాయి. ఇంతలో కరెంటు ఫెయిలయింది. ఓడలోంచి బస్తాలు తెస్తున్న మూడు క్రేన్లు ఆగిపోయాయి. ఆ బెర్త్ మీద పని చేసే వర్కర్లకు తాత్కాలికంగా విశ్రాంతి లభించింది. ఆ బెర్త్ మీద పని చేసే అప్పారావు, రామారావు ఇద్దరూ చెరొక పంచదార బస్తా మీద కూర్చుని మట్లాడుకోసాగారు.

"ఒరే అప్పారావ్ ! మన కీ ఫోర్మన్ వెంకట గిరి అన్ని విషయాల్లోనూ బాగానే ఉంటాడు గాని ఆ నమస్కారం పెట్టించుకునే విషయంలోనే కొంచెం చికాకుగా ఉందిరా! ఆ గుణం ఆయన్లో ఎపుడు పోతుందో ఏమిటో" అన్నాడు రామారావు.

"ఏం చేస్తాంరా? ఆయనకదో దురలవాటు. మనిషికో బలహీనత ఉంటుంది. మరి ఎలాగో ఒకలా సర్దుకు పోవాలి మనం" అన్నాడు అప్పారావు. ఇంతలో సిగరెట్ కాల్చుకుంటూ వచ్చాడు నూకరాజు "ఏంటి గురూ! ఇద్దరూ గుసగుసలాడుకుంటున్నారు. సాయంత్రం స్కైరూమ్ బార్‌లో పార్టీయా?" అంటూ. అప్పారావూ, రామారావూ విషయం ఏమిటో చెప్పారు.



"ఓస్ ! ఆ వెంకటగిరి సంగతి నాకొదిలేయండి. ఏదైనా అవకాశం రావాలి గాని, అతని చేత నమస్కారం పెట్టించుకునే అలవాటు మాని పించే పూచీ నాది" అంటూ గుప్ గుప్‌మని రెండు దమ్ములు లాగాడు నూకరాజు.

"అది సరే గాని నూకరాజూ బెర్త్ మీద పొగ తాగరాదని బోర్డుంది. అదీగాక మన డాక్స్ ఆఫీసరు గారు గాని వచ్చారా ఆయనకు మా చెడ్డ పట్టింపు. దయచేసి ఆ సిగరెట్ ఆర్పేద్దూ" అన్నాడు రామారావు.

"ఆ ! ఇపుడాయనెందుకొస్తాల్లెద్దూ..." అంటూ లేచి వెళ్ళిపోయాడు. బ్రతుకు జీవుడా అనుకున్నారు ఇద్దరూ. ఎందుకంటే తమ దగ్గర కూర్చుని నూకరాజు సిగరెట్ కాలుస్తున్నా, ఆ డాక్సు ఆఫీసరు గారు ముగ్గురూ కాలుస్తున్నారంటూ చిందులేస్తాడు మరి.

*** *** ***

రోజులు గడుస్తున్నాయి. వెంకట గిరి కీ ఫోర్మన్‌కు నమస్కారం పెట్టించుకునే అలవాటు పోలేదు. వర్కర్లందరూ అలా అలా అడ్జస్టు అవుతున్నారు. అంతేకాదు. వెంకటగిరి ఎక్కడ ఎవ్వుడు ఎన్నిసార్లు కనపడినా "నమస్కారం సార్" అనడానికి అలవాటు పడిపోయాడు.

కొన్నాళ్ళకు వెంకటగిరి ఓ చిన్న మోటారు సైకిలు కొన్నాడు. కాని దాన్ని నడపటంలో నైపుణ్యం లేక చాలా జాగ్రత్తగా నెమ్మదిగా దాన్ని డ్రైవ్ చెయ్యసాగాడు. త్రోవలో ఏదైనా ఎదురు వస్తే ఆమడ దూరంలోనే బ్రేకులు వేసి, ప్రమాదం ఏదీ ఉండదని నిర్ణయించుకున్నాకే మళ్ళీ స్టార్ట్ చేసి నడుపుతూంటాడు.

ఓ రోజు అనుకోకుండా వెంకటగిరి మోటారు సైకిలుమీద వస్తూ టౌన్లో ఓ చోట నూక రాజుకు ఎదురయ్యాడు. నూకరాజు ఓ సందులోంచి వస్తూ మెయిన్‌రోడ్డు ఎక్కేసరికి వెంకటగిరి వస్తూ కనిపించే సరికి అలవాటు ప్రకారంగా "నమస్కారం సార్" అన్నాడు. వెంకటగిరి నూకరాజు రాకను గమనించకపోవడంతో సడెన్‌గా 'నమస్కారం సార్' అన్న మాట వినపడి తడబాటుగా నూకరాజును చూచి అతను పెట్టిన నమస్కారాన్ని అందుకోడానికని ఏక్సిలేటరు పట్టుకునన్న కుడిచేతిని గమ్మున ఎత్తాడు. అసలే స్లోగా వస్తున్న మోటారు సైకిలు ఏక్సిలేటరు ఒదిలెయ్యడంతో మరింత స్లో అయిపోయింది. వెంకటగిరి గాబరాలో క్లచ్ నొక్కటం మానెయ్యటంతో బండి గేర్‌లో ఉండేమో ఒక్క జర్కు ఇచ్చి ఆగిపోయింది. దాంతో వెంకటగిరి మరింత కంగారు పడిపోయాడు. ఇదంతా చూస్తున్న నూకరాజు ఆశ్చర్యంగా వెంకటగిరిని సమీపించి "ఏం సార్? బండి ట్రబులిస్తోందా?" అన్నాడు.

"అబ్బే లేదు లేదు" అంటూ వెంకటగిరి తంటాలుపడి గేర్ న్యూట్రల్‌లోకి తెచ్చాడు. ఈ లోపల రోడ్డుమీద ట్రాఫిక్ నిలిచిపోయింది. బీటు కానిస్టేబిలు విజిల్ వేసుకుంటూ రాసాగాడు. దాంతో వెంకటగిరికి చెమటలు పట్టేశాయి. గబగబ స్టార్ట్ చేసి "వస్తానోయ్" అంటూ ముందుకు కదిలాడు. ఆదరా బాదరాగా వెళ్ళిపోతున్న వెంకటగిరి కళ్ళలో ఏదో కనిపించింది నూకరాజుకు. వెంటనే "యురేకా" అంటూ కేకవేశాడు.

మర్నాడు నూకరాజు డ్యూటీలో తనతోటి వర్కర్లందరితో, "ఒరేయ్! మీరంతా నేను చెప్పినట్టు చేస్తే మన ఫోర్మన్ వెంకటగిరికి ఉన్న నమస్కారం పెట్టించుకునే అలవాటు పోగొట్టేయవచ్చు" అన్నాడు.

"ఏమిటి? ఎలా ?" అంటూ అందరూ ఆశ్చర్యంగా చూశారు.

"నేను చెప్పినట్టు చేస్తానని ముందు మాటివ్వండి" అన్నారు.

"సరే ఇస్తున్నాం" అన్నా రందరూ. అందరికీ ఆశ్చర్యమే! ఏం చెయ్యబోతున్నాడు నూకరాజు?

వెంకటగిరి అలవాటును ఎలా మార్చబోతున్నాడు? ఇది సాధ్యమేనా? ఇలా ఎవరికి వారే ప్రశ్నలు వేసుకోసాగారు.

నూకరాజు సిగరెట్ గట్టిగా పీల్చి చెప్పసాగాడు.

"ఇవాళ సాయంత్రం ఆరు గంటలకు మీరంతా నేను చెప్పిన స్థలాల్లో నిలుచుని, మన వెంకటగిరిగారు మోటారు సైకిలు మీద రాగానే, 'నమస్కారం సార్!' అంటే చాలు అన్నాడు మరో సిగరెట్ ముట్టించుకుంటూ.

నూకరాజు ఇంకేదో పెద్దప్లాను చెబుతాడని ఎదురు చూసిన వర్కర్లంతా నిరుత్సాహంగా, "ఇదా నువ్వు చెప్పేది? ఆయనకి నమస్కారం పెట్టడం తప్పిపోతుందని మేమేదో సరదా పడుతుంటే, మళ్ళీ ఆయనకే నమస్కారాలు పెట్టమంటావా?" అంటూ నీరసపడిపోయారు. నూకరాజు రెండు దమ్ములు గట్టిగా లాగి. "సోదరులారా! నిరుత్సాహ పడకండి! ఈరోజు ఒక్కరోజు మాత్రమే మీరు వెంకటగిరిగారికి నమస్కారం పెట్టండి. రేపుదాని తమాషా చూడండి. ఈ ఒక్కసారి నా మాట వినండి" అన్నాడు. అంతకన్నా చేసేది లేక "సరే" అన్నా రందరూ.

ఆ సాయంత్రం సరిగ్గా ఆరయ్యేసరికి నూకరాజు మెయిన్‌రోడ్డులో ఉన్న ఒక్కో సందులో ఒక్కొక్కరిని నిలబడమన్నాడు. వెంకటగిరి మోటారు సైకిలు మీద వచ్చే సమయానికి సందులోంచి టక్కున రోడ్డు మీద కొచ్చి నమస్కారం పెట్టమన్నాడు. అందరూ సరే నంటూ నిలుచున్నారు. నూకరాజు మాత్రం అందరికంటే చివరి సందులో నిలుచుని వెంకటగిరి రాక కోసం చూడసాగాడు.

వెంకటగిరికి రోజూ సాయంత్రం మార్కెట్టుకు వచ్చి కూరలు కొనడం అలవాటు. అందుచేత రోజూ లాగే మోటారు సైకిలు మీద రాసాగాడు. కొంతదూరం వచ్చేసరికి మొదటి సందులోంచి ఓ వర్కరు సడెన్‌గా "నమస్కారం సార్" అంటూ ఎదురయ్యాడు. పాపం వెంకటగిరి మొన్నటిలాగే ఏక్సిలేటరు మీంచి చెయ్యి తీ సెయ్యడం, క్లచ్ నొక్కడం మరచిపోవడం, వెంటనే బండి ఆగిపోవడం, ట్రాఫిక్ జామ్ అవడం జరిగిపోయాయి. మళ్ళీ మరి కొంచెం దూరం రాబోయేసరికి మరో వర్కరు ఎదురయ్యాడు. వెంకటగిరి మళ్ళీ కన్‌ఫ్యూజన్ డిటో డిటో! ఇలా ఓ అరడజను మంది ఎదురయేసరికి వెంకటగిరికి ముచ్చెమటలు పోశాయి. ఈలోగా మోటారు సైకిలు అస్తమానం గేర్లో పడి ఆగిపోవడంతో, ఆ గేర్ వైర్లు కాస్తా 'ఫట్'మని తెగిపోయాయి! దాంతో మోటారు సైకిలును తోసుకుంటూ, చెమటను తుడుచుకుంటూ, "వెధవలు ఇవాళ ఇంతమంది ఇక్కడ తగు లడ్డారేమిటి? వెధవలు! వీళ్ళు పెట్టే వెధవ నమస్కారాలు అందుకోవడం వల్లే నాకీ ఇక్కట్లు వచ్చాయి! వెధవలు డ్యూటీలో కనిపించినప్పుడు నమస్కారం పెట్టారు చాలదా? టౌన్లో కనిపిస్తే కూడా నమస్కారం పెట్టాలా? ఇదంతా తను కోరి తెచ్చుకున్నదే!" అని తిట్టుకుంటూ బండి నడిపించసాగాడు. ఇంతలో నూకరాజు ఎదురై, "నమస్కారం సార్!" అన్నాడు నవ్వుతూ. అంతే! బిగుసుకుపోయి ఉన్న వెంకటగిరి అమాంతంగా "బాబోయ్, నమస్కారం" అంటూ రెండు చేతులు ఎత్తి నమస్కరించాడు. వెంటనే అతని చేతుల్లోంచి మోటారు సైకిలు దబ్బున కింద పడిపోయింది.

మర్నాడు పొద్దున్న యథావిధిగా కీ ఫోర్మన్ డ్యూటీకి రావడం, వర్కర్లందరూ నమస్కారాలు పెట్టడం జరిగింది. కానీ వెంకటగిరి ఎవరి నమస్కారాలూ అందుకోకుండా సీరియస్‌గా కంట్రోలు రూమ్ మెట్లు ఎక్కసాగాడు. వర్కర్లందరూ ఆశ్చర్యంగా చూశారు. నూకరాజు "చూస్కోండి, నా తడాఖా" అంటూ మీసం మీద చెయ్యి వేశాడు.

వెంకటగిరి మెట్లన్నీ ఎక్కి బాల్కనీలో నిలుచుని వర్కర్లందరినీ కలయజూస్తూ "చూడండి! మీరంతా నా మీద గౌరవం కొద్దీ నేనెక్కడ కనిపిస్తే అక్కడ నమస్కారాలు పెడుతున్నారు. కానీ ఇకమీదట అలా చెయ్యొద్దు. మీ అందరికీ నమస్కారం చేసి మరీ చెబుతున్నాను. ముఖ్యంగా నేను మోటారు సైకిలు మీద ఎక్కడ కనిపించినా సరే నమస్కారం పెట్టొద్దు. అంతే!" అని చెప్పి కంట్రోలు రూమ్‌లోకి వెళ్ళిపోయాడు.

★

26-2-86 నుండి

4-3-86 వరకు

# వారఫలాలు

## మేషం

మీరు బ్రహ్మచర్యం ఇంతవరకూ ఆచరిస్తూ ఉంటే ఇటీవల మీకు ప్రాప్తించిన స్నేహప్రభావం మీ వ్రత భంగానికి మూలకారణం కాబోతున్నది. వివాహితులైతే మీ కుటుంబ జీవితంలో నూతన పరిణామాలు తప్పవు. ఈ వారంలో మీరు తండ్రి కాబోయే అవకాశాలు ఆనందపరుచనున్నవి.

## వృషభం

బాధ్యత నెరిగినవారు, ప్రపంచజ్ఞానం కలవారు, ఇతరుల మనస్తత్వాన్ని సులభంగా గ్రహించగలవారు ఎంతోకొంతవరకు ప్రాప్తించిన విషయాభిమానులుకాగా అందుకు తగిన స్వార్థంగలవారు మీరంటే మీరు అంగీకరించరు. ఈ వారంలో ఈ విధంగా మీకై మీరే ఒప్పుకొంటారు.

## మిథునం

మేధాశక్తి మీ వరం. కాని స్థిమితం ఉండదు. ఇది వాయుతత్త్వ ద్విస్వభావరాశి కావటం మిథున రూపాన్ని పొందుట ఇందుకు మూలకారణాలు. స్థిమితంగా వ్యవహరిస్తే మీ అభివృద్ధికి అవధులు ఉండవు. అది లోపిస్తే మీరు చిక్కులో పడి సమస్యల నెదుర్కొనవలసిరాక తప్పదు. ఇది గ్రహించండి.

## కర్కాటకం

ఈ రాశివారి ప్రత్యేక లక్షణాలు బహుళం। మీరు మేధావులు. కార్యదక్షులు. బంధుప్రీతి గలవారు. తమ కుటుంబం ప్రధానంగా ఉండాలను కాంక్ష గలవారుగా ఉంటారు. ఈ లక్షణాలవలన ఇతరులకు అపకారం లేదుగాని వీనిని సాధించే వాంఛతో దుర్మార్గాలకు పోరాదని గ్రహించండి.

## సింహం

మీ భార్య లేక భర్త విషయంలో మీకు సర్వవిధాల ఆనందం తృప్తి కలిగించే పరిణామాలు ఈ వార విశేష స్వభావాలు. ఇది చూచి సహించజాలని మీ బంధువర్గంలో కొందరు గావించే కుట్రలను గ్రహించి వారికి దూరంగా మీ భార్య లేక భర్తలను ఉంచండి.

## కన్య

మీకు రాబోయే కాలం చాలా ప్రాధాన్యతతో కూడి ఉంటుంది. అంటే ఇంతవరకు మీరు అనామకులనే భావం కాదు. బాధ్యతలు, ఎక్కువగల పదవిని పొందనున్నారు. వానిని నిర్వహించే సమర్థత మీకు గలదని అందరూ గ్రహించి ఆ బాధ్యతల మీ వరం చేస్తారు. జాగ్రత్తగా నిర్వహించండి.

## తుల

ఈ వారంలో మీరు సంకల్పించే నూతన విషయాలను అమలుచేయండి. వానిలో తగిన అభివృద్ధి పొందగలుగుతారు. ఈ కాలంలో ఇద్దరు వ్యక్తులు మీకు సాయం గావించనున్నారు. వారు మీ అభివృద్ధిని కాంక్షించే సన్నిహిత బంధువులలో ఉన్నారు. ఈ సదవకాశం పోగొట్టుకోరాదు.

## వృశ్చికం

క్రమమార్గంలో ఆలోచనచేసి న్యాయబద్ధంగా వ్యవహరిస్తే భగవత్ ప్రీతికి పాత్రులై అదృష్టవంతులవుతారు. మీరు పెట్టుబడి పెట్టి గావించ సంకల్పించిన వానిలో కూడా మీ సహచరులు అండగా ఉంటారు. భూ సంబంధమైన కార్యకలాపాలు అనుకూలంగా ఫలించే కాలం.

## ధనుస్సు

మీ కుటుంబ వ్యవహారాలు. బంధువులతో మీకు గల సంబంధాలుగాని ఈ వారంలో కడు తృప్తికరంగా పరిణమించనున్నవి. మీరు సంకల్పించిన శుభ కార్య విషయంలో మీరు అపేక్షించిన సాయం సంపత్తి అనాయాసంగా లభిస్తుంది. జయప్రదంగా కార్యాలు నిర్వహిస్తారు.

## మకరం

శుక్రవారం, శనివారం రెండు రోజులు మీ అనుచరులు, మీ సహచరులు మీతో వైరుధ్యంవహించే ప్రయత్నంలో ఉంటారు. ఇది ఒక నూతన పరిణామం. ఈ వారాంతం కాలానికి వారితో వాగ్వాదాలు తీవ్రత నొందుటవలన మానసిక శాంతి లభించదు.

## కుంభం

ఏదైనా మార్పులు గావించవలసిన అవసరం ఏర్పడితే సందేహించకుండా చేయండి. నష్టం లేదు. మీకన్న ఉన్నత స్థాయిలోనున్న వారితో వ్యవహరించేటప్పుడు మీ మనోభావాలను దాచకుండా వివరించండి. అందువలన వారు మీ భావాలను గ్రహించి అపార్థం చేసికొనకుంటారు.

## మీనం

ఇతరుల ఆదరాభిమానాలను సంపాదించాలంటే, మంచిని పెంచుకోవలయునంటే మీరు లోగడ సంపాదించిన కీర్తిప్రతిష్ఠలు పెంపొందించుకొనదలిస్తే ఈ వారం సర్వానుకూలప్రదం. ఇప్పుడు మీరు గావించే ప్రతి పనిలోను జయం, కీర్తి లభించే అవకాశా లున్నందున ఈ కాలాన్ని సద్వినియోగం చేసికోండి.

-దివాకరుని

వెంకటసుబ్బారావు

*